

వీడీసీలను కట్టడి చేయండి

సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న వీడీసీలకు చాకిరీ చేసే పరిస్థితి ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

- IIలో ▸



హడలెత్తిస్తున్న చిరుత..

ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై చిరుత పులి సంచారం స్థానికులను భయాందోళనలకు గురి చేస్తోంది.

- IIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.4 /25.0

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘భూభారతి’తో సామాన్యుడికి మేలు



నాగిరెడ్డిపేట/లింగంపేట: భూభారతి చట్టం ద్వారా సామాన్యుడికి మేలు జరుగుతుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన లింగంపేట మండలం శెట్పల్లిలో ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ ఏది చెబితే అదే చట్టంగా ఉండేదన్నారు. దొరగారు ధరణి పథకాన్ని భూస్వాముల కోసం తెచ్చి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. భూ భారతి చట్టం అలా కాకుండా పకడ్బందీగా పేదోడికి న్యాయం జరిగేలా రూపొందించామన్నారు. 18 రాష్ట్రాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, 9 నెలలు మేధో మథనం చేసి మేధావుల సూచనలు, సలహాలు తీసుకొని చట్టాన్ని తెచ్చామని, ఇది దేశానికి రోల్ మోడల్ కాబోతుందన్నారు.

ఇందూరును స్మార్ట్ సిటీగా మారుస్తాం

- నుడా చైర్మన్ కేశ వేణు



నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా మారుస్తామని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. జిల్లాకేంద్రంలోని పలు జంక్షన్లను మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఏసీపీ నారాయణతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్టీఆర్ చౌరస్తా, కంఠేశ్వర్, పులాంగ్, వినాయక్‌నగర్, నెహ్రూపార్కు, ఆర్‌ఆర్ చౌరస్తా, వర్ని చౌరస్తా, ఖిల్లా చౌరస్తా, గోశాల రోడ్, గౌతంనగర్, హైదరాబాద్ బైపాస్, ఎల్లమ్మగుట్ట తదితర ప్రాంతాలను పరిశీలించి జంక్షన్ల విస్తరణ చేపట్టాలని, ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీరు నిలిచే ప్రదేశాలను గుర్తించాలని, వర్షాకాలంలో సమస్యలు రాకుండా ముందస్తుగా పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు, సిబ్బంది ఉన్నారు.

కాలభైరవం భజే..



రామారెడ్డి: దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం ఇసన్నపల్లి(రామారెడ్డి)లోని కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం వైశాఖమాస పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి మంగళవారం కావడంతో 108 రకాల పండ్లతో స్వామివారిని అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందూరుకు అమృత్ నిధులు రూ.400 కోట్లు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో యూజీడీ, వాటర్ వర్క్స్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అమృత్–2 స్కీమ్ కింద రూ.400 కోట్లు మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నగర శివారులోని గంగాస్థాన్ ఫేజ్–1లో కొనసాగుతున్న యూజీడీ పనులతోపాటు మురుగునీటి శుద్ధీకరణ పంప్‌హౌజ్‌ను ప్రజారోగ్యశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. యూజీడీ పనులు నత్తనడకన సాగుతున్నాయని కాంట్రాక్టర్, అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. అమృత్ నిధులతో యూజీడీ పనుల్లో భాగంగా 150 మ్యాన్‌హోల్స్ పునర్నిర్మాణం, 45 కొత్త మ్యాన్‌హోళ్ల నిర్మాణం, కిలోమీటర్ మేర పైప్‌లైన్ పనులు చేశారన్నారు. ఏడాదిన్నర కాలంలో అర్బన్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ యూజీడీ కనెక్షన్ ఇచ్చి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట పబ్లిక్ హెల్త్ డీఈ నగేశ్‌రెడ్డి, సాయిచంద్, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఆనంద్‌రావు, సాయిప్రవీణ్, మఠం పవన్, ఆనంద్, అధికారులు ఉన్నారు.

నూతన బోర్లకు అనుమతి తప్పనిసరి

వాల్టా చట్టం అమలుకు జిల్లా యంత్రాంగం కసరత్తు



వాల్టా చట్టం అమలుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇక నుంచి కొత్త బోరు వేయాలంటే అధికారుల అనుమతి తప్పనిసరి తీసుకోవాల్సిందే.. లేదంటే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుంది. వేసవి నేపథ్యంలో జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటుతుండగా, మరోవైపు గ్రామాలు, పట్టణాల్లో గృహ అవసరాల కోసం విచ్చల విడిగా బోర్లు వేస్తున్నారు. వ్యవసాయ భూముల్లో బోర్లు ఎత్తిపోవడంతో రైతులు కొత్త బోరు వేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

- తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు పర్యవేక్షణ బాధ్యతలు
- ఇష్టారాజ్యంగా బోర్లు వేసిన వారిపై చర్యలు తీసుకునే అధికారం

డొంకేశ్వర్(ఆర్మూర్): మీరు కొత్త బోరు వేస్తున్నారా? అయితే తహసీల్దార్ లేదా మున్సిపల్ కమిషనర్ అనుమతి తీసుకోవాల్సిందే. ఒకవేళ అనుమతి లేకుండా ఇష్టానుసారం బోర్లు వేస్తే చర్యలకు గురి కాక తప్పదు. ఎందుకంటే వాల్టా చట్టం అమలుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇటీవల కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు దీనిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో గృహ అవసరాల కోసం విచ్చల విడిగా కొత్త బోర్లు వేస్తున్నారు. ఇటు వ్యవసాయ భూముల్లో బోర్లు ఎత్తిపోవడంతో రైతులు మరో చోట బోరు వేసేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో భూగర్భ జలాలు వేగంగా తగ్గిపోతున్నాయి.

వందల సంఖ్యలో..

జిల్లాలో రోజుకు 100 నుంచి 150 వరకు కొత్త బోర్లు వేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1.86 లక్షల వ్యవసాయ బోర్లు ఉన్నాయి. గృహ బోరు కనెక్షన్లు సుమారు 6.70 లక్షల వరకు ఉండగా, వీటి కనెక్షన్‌లు రోజురోజుకు పెరుగుతున్నాయి. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు బోరు వేయడం తప్పనిసరిగా మారింది.దీంతో గ్రామాలు, పట్టణాల్లో 40–45 శాతం గృహ వినియోగ బోర్లు ఉన్నాయి. బోర్లు వేసే సమయంలో యజమానులు, రైతులు ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. కనీసం అధికారులకు సమాచారం కూడా ఇవ్వడం లేదు. ఇష్టానుసారం ఒక్కో బోరును 500 నుంచి 900 మీటర్ల వరకు తవ్విస్తున్నారు. తద్వారా భూమిలోని పొరలు పక్కకు జరిగే అవకాశం ఉంటుంది. నీటి లభ్యత కూడా తగ్గిపోతుంది. వీటిని నివారించడానికి వాల్టా నిబంధనలు అమలు చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

బోరుబండ్ల యజమానులకు నిబంధనలు..

గ్రామాల్లో బోరు వేస్తే తహసీల్దార్, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ల నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలనే నిబంధన తప్పనిసరి చేయాలని చూస్తున్నారు. నిబంధనలు పాటించకుండా బోరు వేస్తే సీజ్ చేయడం లేదా జరిమానా విధించే అధికారాలు కూడా వాల్టా చట్టం కల్పించిందని జిల్లా స్థాయి కమిటీలో మెంబర్‌గా ఉన్న అధికారి ఒకరు తెలిపారు. అదే విధంగా అనుమతి ఉంటేనే బోరు వేయాలని బోరు వేసే వాహన యజమానులకు సైతం నిబంధనలు పెట్టనున్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్ ఉండగా, కన్వీనర్‌గా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ), సభ్యులుగా భూగర్భ జల శాఖ అధికారి, మిషన్ భగీరథ ఎస్ఈ, పబ్లిక్ హెల్త్ ఈఈ, ఇరిగేషన్ ఎస్ఈ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఉన్నారు. ఈ కమిటీ వాల్టా చట్టాన్ని అమలయ్యే విధంగా చూస్తుంది.

విభేదాలు సృష్టిస్తే సస్పెండ్ చేస్తాం



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

- పార్టీ పటిష్టతకు కృషి చేయాలి
- కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): కొత్త, పాత అంటూ విభేదాలు సృష్టిస్తే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి సుదర్శన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు మనస్పర్థలు వీడి క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించే వారే నాయకులుగా ఎదుగుతారన్నారు. పార్టీకోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో జిల్లాకు విశ్వవిద్యాలయం, మెడికల్ కళాశాల, ప్రాణహిత – చేవెళ్ల, ఎత్తిపోతల పథకాలను తీసుకువచ్చినట్లు తెలిపారు.

రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసే పని చేస్తున్నాయని, ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తాయన్నారు.

సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. మే 4 నుంచి 10వ తేదీలోగా అన్ని నియోజకవర్గాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి న్యాయం జరుగుతుందని, 2017 కన్నా ముందు పార్టీలో ఉన్న వారికి ముందు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు.

అబ్జర్వర్, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ బోధన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, ఆయా కార్పొరేషన్‌ల చైర్మన్లు అన్వేష్‌రెడ్డి, కాసుల బాలరాజు, నుడా చైర్మన్ కేశవేణు, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, రాజేశ్వర్, అరికెల నర్సారెడ్డి, టీపీసీసీ ప్రధానకార్యదర్శి నగేశ్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, సాయారెడ్డి, తారాచంద్, అమృతాపూర్ గంగాధర్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



ఆమ్దానీ లేక ఆమ్‌చూర్ రైతులు దిగులు చెందుతున్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటాల్ ధర రూ.17,800 పలికింది. గతేడాది సీజన్‌లో రూ.32వేలకు పైగా ధర పలకగా, ఈ ఏడాది సగం వరకు పడిపోయింది. మార్కెట్‌యార్డుకు వివిధ జిల్లాల నుంచి 218 క్వింటాళ్ల ఆమ్‌చూర్ వచ్చింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఓపీ చీటీపై నెలరోజులపాటు వైద్య సేవలు

- అవుట్ పేషెంట్ సంఖ్య కాదు.. మెరుగైన సేవలు ముఖ్యం
- వైద్యుల నుంచి సెక్యూరిటీ వరకు అందరూ సమయ పాలన పాటించాలి
- పకడ్బందీగా వైద్యులు, సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ
- మోకాలితోపాటు అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నాం
- త్వరలోనే గుండె సంబంధిత ఆపరేషన్లు
- ‘సాక్షి’తో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్



పేషెంట్ వైద్యం కోసం ఒకసారి ఓపీ చీటీ తీసుకుంటే దానిపైనే నెల రోజులపాటు సేవలందుతాయని, అవుట్ పేషెంట్ సంఖ్య కన్నా మెరుగైన వైద్య సేవలే ముఖ్యమని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ అంటున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్‌ల నుంచి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకుని పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్న శ్రీనివాస్‌తో ‘సాక్షి’ ఇంటర్వ్యూ..

– నిజామాబాద్‌నాగారం

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి : సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించి మూడు నెలలు పూర్తయ్యింది.. ఎలాంటి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు?

సూపరింటెండెంట్ : ఈ ఏడాది జనవరి 14న బాధ్యతలు తీసుకున్నా. ఆస్పత్రిలోని అన్ని విభాగాల బాధ్యులతో సమీక్షిస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తున్నా. ఆర్థో, జనరల్ సర్జన్, గైనిక్, కంటి, తదితర అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్, ఇతర సెక్షన్‌ల వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నా.

■ గతంలో రికార్డు స్థాయిలో ఓపీ నమోదు కాగా.. ప్రస్తుతం తగ్గుతోంది ఎందుకు?

■ ఒక రోజు ఓపీ చీటీ తీసుకున్న వారు వైద్యం అందక, వైద్యులు అందుబాటులో లేక వెనుదిరిగి మరుసటి రోజు వస్తే మళ్లీ ఓపీ నమోదు చేయించుకునే వారు. ఏ రోజుకారోజు ఓపీ చీటీ తీసుకోవడంతో రోగుల సంఖ్య ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం ఒకసారి ఓపీ చీటీ తీసుకుంటే నెల రోజుల వరకు దానిపైనే వైద్య సేవలు అందిస్తున్నాం. దీంతో రోగుల సంఖ్య ఎక్కువ కనిపించడం లేదు.

■ గతంలో రోగులను వారి సహాయకులే స్ట్రెచర్, వీల్‌చైర్‌లపై తీసుకొచ్చేవారు.. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంది?

■ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించా. పేషెంట్‌కేర్ విభాగంలో పని చేస్తున్న వారందరిలో చాలా మార్పు వచ్చింది. గతానికి ఇప్పటికి చాలా తేడా ఉంది.

■ అన్ని రకాల శస్త్రచికిత్సలు చేస్తున్నారా?

■ అన్ని రకాల శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. మోకాలిచిప్ప ఆపరేషన్లు సైతం జరుగుతున్నాయి. ఎలాంటి అపోహకు తావివ్వొద్దు.

■ గైనిక్, కంటి సేవలు ఏ విధంగా అందుతున్నాయి?

■ గైనిక్, కంటి, ఆర్థో, తదితర విభాగాలకు సంబంధించిన వైద్యులు, స్టాఫ్ అందుబాటులో ఉన్నారు. రోగులకు కూడా సేవలు అందుతున్నాయి. సాధరణ డెలివరీలు ఎక్కువగా జరుగుతున్నాయి.

■ డీఎంఈ బృందం తనిఖీ చేసింది కాదా.. ఎలాంటి మార్పులు జరగొచ్చు..?

■ జీజీహెచ్‌ను డీఎంఈ బృందం తనిఖీ చేసిన సమయంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, పైప్‌లైన్ లీకేజీ తదితర సమస్యలపై నివేదిక అందించాం. టీజీఎంఎస్ఐడీసీ ద్వారా త్వరలోనే పనులు జరగనున్నాయి. జీజీహెచ్ అందంగా ముస్తాబుకానుంది.

■ మాతాశిశుసంరక్షణ, క్రిటికల్ కేర్ విభాగాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయి?

■ మాతాశిశుసంరక్షణ, క్రిటికల్ కేర్ విభాగంలో ఇంకా కొన్ని పనులు మిగిలిపోయాయి. ఆక్సిజన్ పైప్‌లైన్, రెండు లిఫ్టులు, పరికరాలు అన్ని అందుబాటులోకి రానున్నాయి. మూడునెలల్లో పనులు పూర్తవుతాయి. జీజీహెచ్ నుంచి గైనిక్, ఎస్ఎన్‌సీయూను తరలిస్తాం.

■ సిబ్బంది నిబంధనలు పాటిస్తున్నారా? పర్యవేక్షణ ఎలా ఉంది?

■ నాతో సహా అందరూ నిబంధనలు పాటించాల్సిందే. ప్రభుత్వానికి మంచి పేరు తేవడంతో పాటు జీజీహెచ్ వచ్చే రోగులకు నమ్మకంతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తా. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు ఆయా విభాగాల్లో ఉండాల్సిందే. పర్యవేక్షణ పకడ్బందీగా ఉంది. సీసీ కెమెరాల ద్వారా సైతం పర్యవేక్షిస్తున్నాం.

■ గుండె సంబంధిత ఆపరేషన్లు చేస్తున్నారా? వైద్యులు అందుబాటులో ఉన్నారా?

■ ప్రస్తుతం ప్రతి బుధ, శనివారం గుండె సంబంధింత వైద్యులు అందుబాటులో ఉంటూ ఓపీ సేవలందిస్తున్నారు. గుండెకు సంబంధింత ఆపరేషన్లను త్వరలోనే ప్రారంభిస్తాం. వైద్యులను రిక్రూట్ చేసుకుంటున్నాం. అన్ని సదుపాయాలు, సౌకర్యాలు సమకూరిన తర్వాతే గుండె ఆపరేషన్లు, స్టంట్లు వేయడం ప్రారంభిస్తాం.



రోగితో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ (ఫైల్)

■ జీజీహెచ్‌లో సమయ పాలన పాటించరనే విమర్శలున్నాయి కదా?

■ వైద్యులు, నర్సింగ్‌స్టాఫ్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ ఇతర ఉద్యోగులు ఎవరైనా సరే సమయపాలన పాటించాల్సిందే. ఆయా విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోలు నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు.

తాళం



మాక్లూర్ సొసైటీకి తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు

- ధాన్యం కాంటా చేయడం లేదని మాక్లూర్ సొసైటీకి..
- పని చేయని కొనుగోలు కేంద్రాలు ఎందుకని రైతుల ఆగ్రహం

మాక్లూర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గొట్టుముక్కల గ్రామానికి చెందిన రైతులు మాక్లూర్ సొసైటీకి తాళం వేశారు. మంగళవారం ఉదయం సొసైటీకి చేరుకున్న రైతులు సిబ్బందిని బయటకి పంపి తాళం వేసి ధర్నా చేశారు. డీసీవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ శేఖర్, సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్‌ను వెంటబెట్టుకుని సొసైటీకి వద్దకు చేరుకుని రైతులను శాంతింపజేశారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని రైతులను సముదాయించి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.



తాళం వేయడంతో బయట వేచిఉన్న తహసీల్దార్, ప్రజలు

- భవనం అద్దె చెల్లించడం లేదని మోపాల్ తహసీల్‌కు..
- అధికారులు, సిబ్బందిని బయటికి పంపిన యజమాని

మోపాల్: భవనం అద్దె 15 నెలలుగా చెల్లించడం లేదని మోపాల్ తహసీల్ కార్యాలయానికి ఇంటి యజమాని గంగవ్వ తాళం వేశారు. మంగళవారం ఉదయమే తహసీల్ కార్యాలయానికి చేరుకున్న గంగవ్వ కార్యాలయంలో ఉన్న అధికారులు, సిబ్బందిని బయటికి పంపించి తాళం వేయడం చర్చనీయాంశమైంది. సుమారు గంటకుపైగానే తహసీల్దార్ రామేశ్వర్‌తోపాటు ఉద్యోగులు, సిబ్బంది, పనుల నిమిత్తం వచ్చిన వారు కార్యాలయం ఆవరణలోనే ఉండిపోయారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా అద్దెకు సంబంధించి రూ.75వేలు ఈ–కుబేర్‌లో, మిగతా రూ.65వేల చెక్కు కలెక్టర్ కార్యాలయంలో మంజూరు కావాల్సి ఉందన్నారు. రూ.65వేల చెక్కును రెండు రోజుల్లో అందజేస్తామన్నారు.

క్లుప్తంగా

లయన్స్ ఆస్పత్రికి ప్రభుత్వ భవనం



బోధన్: బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రి నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న జనరల్ ఆస్పత్రికి ప్రభుత్వ భవనాన్ని కేటాయించారు. ఈమేరకు మున్సిపల్ శాఖకు సంబంధించిన భవనాన్ని కేటాయిస్తు జారీ చేసిన ఉత్తర్వులను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆస్పత్రి నిర్వాహకులకు మంగళవారం పట్టణంలో అందించారు. క్లబ్ ప్రతినిధులు నాగేశ్వర్ రావు, ప్రతాప్ గుప్తా తదితరులు ఉన్నారు.

లండన్‌లో జిల్లా విద్యార్థి క్షేమం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన నల్ల అనురాగ్‌రెడ్డి లండన్‌లో తప్పిపోయిన సంగతి విధితమే. కానీ మంగళవారం ఆయన ఆచూకీ లభించినట్లు, క్షేమంగానే ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆయన ఫోన్ మిస్ కావడంతో, కాల్స్ కలువక కుటుంబ సభ్యులు ఆందోళన చెందినట్లు పేర్కొన్నారు. ఇతరుల ఫోన్ నుంచి అతడు కాల్ చేసి క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సమచారమందించాడని వారు తెలిపారు.

రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ ఎస్సైగా సయ్యద్ ఇమ్రాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై యాసీర్ అరాఫత్ మెండోరాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాల వీఆర్‌లో ఉన్న సయ్యద్ ఇమ్రాన్ రెండోటౌన్‌కు బదిలీపై వచ్చారు.

జాగ్రత్తగా ఉండాలి

సిరికొండ: దొంగతనాలు జరుగుతున్నందున గ్రామాలకు వెళ్లేవారు పక్కింటి వారికి, పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎల్ రామ్ సూచించారు. మండలంలోని చిన్న వాల్గోట్‌లో దొంగతనాలు, సైబర్ నేరాలు, వివిధ సామాజిక అంశాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో గుర్తుతెలియని అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, రొండ్ల గోవర్ధన్‌రెడ్డి, బడాల మహిపాల్, సాయారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న చిరుత సంచారం

- చిరుత పులి నివాసానికి అనువుగా ఉన్న నవనాథ సిద్దుల గుట్ట
- చిరుత సంచరించిన ప్రాంతాలను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు



ఆర్మూర్‌లో చిరుత పులిని పట్టుకోడానికి అటవీ శాఖ అధికారులు తెప్పించిన బోను



నవనాథ సిద్దుల గుట్టపై చిరుత పులి కనబడిన ప్రదేశాలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

ఆర్మూర్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై చిరుత పులి సంచారం స్థానికులను భయాందోళనలకు గురి చేస్తోంది. 2017 మార్చిలో సిద్దుల గుట్టపై చిరుత పులి కనించడంతో అప్పట్లో అటవీశాఖ అధికారులు బోనును ఏర్పాటు చేసి పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఎనిమిదేళ్ల తరువాత తాజాగా సిద్దేశ్వరాలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చే సోమవారం రోజున చిరుత పులి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. కోతులు, కుక్కలు చిరుత పులికి ఇష్టమైన ఆహారం కావడంతో పాటు గుట్టపై కోనేరులో తాగునీటి సౌకర్యం, రాళ్ల గుహలు ఉండటం చిరుత పులి మనుగడకు అనువైన స్థలంగా నవనాథ సిద్దుల గుట్ట ఉందని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పూర్వకాలంలో నవనాథ సిద్దుల గుట్టపై చిరుత పులుల సంచారం ఉండేదని వృద్దులు చెపుతుంటారు. ఇప్పుడు ఇదే ప్రాంతంలో చిరుతపులి కనిపిస్తుండటంతో ఆలయానికి వచ్చే భక్తులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జక్రాన్‌పల్లి, మాక్లూర్, కమ్మర్‌పల్లి మండలాల్లోని అటవీ ప్రాంతంలో పలు మార్లు స్థానికులకు చిరుత పులులు కనిపించడం పరిపాటిగా మారింది. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ శివారులోని వేంకటేశ్వర ఆలయం సమీపంలో పలు మార్లు చిరుతపులి స్థానికులకు కనిపించింది. మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి, సింగంపల్లి, మాదాపూర్ గ్రామాల్లో చిరుతపులి మేకలు, లేగ దూడలపై దాడులు చేసిన సందర్భాలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులు పలు మార్లు ఆయా ప్రదేశాల్లో చిరుత పులిని పట్టుకోవడానికి మేకను ఎరవేసి బోను ఏర్పాటు చేసినప్పటికీ వారి ప్రయత్నాలు విఫలమవుతూనే ఉన్నాయి. అటవీ ప్రాంతం నుంచి గ్రామాలను వీడి పట్టణాల వైపు చిరుతపులి వస్తుండటంతో పట్టణ ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

సిద్దుల గుట్టను పరిశీలించిన అటవీ శాఖ అధికారులు

చిరుత సంచారం నేపథ్యంలో నవనాథ సిద్దుల గుట్ట ఆలయ కమిటీ ప్రతినిధులు జిల్లా ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేసారు. దీంతో జిల్లా ఫారెస్ట్ అధికారులు మంగళవారం సిద్దుల గుట్టను సందర్శించి చిరుత పులి సంచారం ఆనవాళ్లను పరిశీలించారు. చిరుత పులుల సంఖ్య, సంచారాన్ని తెలుసుకునేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులకు, భక్తులకు పలు సూచనలు చేశారు. వారి వెంట ఆలయ కమిటీ ప్రతినిధులు భారత్ గ్యాస్ సుమన్, చరణ్ రెడ్డి, బొబిడే గంగా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బోన్ ఏర్పాటు చేస్తాం



నవనాథ సిద్దుల గుట్టపై చిరుత పులి సంచారం నిజమే కానీ ఎన్ని చిరుత పులులు ఉన్నాయి, వాటి సంచారం తదితర వివరాలను సేకరించడానికి గుట్టపై ట్రాప్ కెమెరాలను బిగించాము. వీడియో రికార్డు ఆధారంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు చిరుతను పట్టుకోవడానికి బోన్‌ను ఏర్పాటు చేస్తాము. అప్పటి వరకు గుట్టపైకి వెళ్లే భక్తులు జాగ్రత్తగా ఉండాలి. వన్య ప్రాణులు ఒకే ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకోవడం అనేది ఉండదు. చిరుత సైతం ఆహారం కోసం అక్కడి నుండి వెళ్లిపోయే అవకాశం ఉంది. ట్రాప్ కెమరాలో ఈ విషయాలు నిర్ధారించుకోవాల్సి ఉంది.

– శ్రీనివాస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఆర్మూర్

అక్షయ తృతీయ.. బంగారానికి డిమాండ్

నిజామాబాద్ రూరల్: హిందూ సంప్రదాయంలో అక్షయ తృతీయకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందని, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని ప్రజలు బలంగా విశ్వసిస్తారు. ఈక్రమంలో నేడు (బుధవారం) అక్షయ తృతీయ సందర్భంగా బంగారు దుకాణాలకు గిరాకీ పెరుగుతుందని వ్యాపారులు ఆశాభావం వ్యక్తం చేశారు. బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజలు జంకుతున్నారు. కానీ అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేకమైన రోజు..

అక్షయ తృతీయ రోజున బంగారం, వెండితో పాటు విలువైన ఆభరణాలను కొంటూ ఉంటారు. అయితే అలా కొనడమే కాదు దానధర్మాలు చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని పండితులు చెబుతున్నారు. అలాగే తులసి పూజ చేయడం వల్ల లక్ష్మీదేవి ఆశీస్సులు లభించడమే కాకుండా డబ్బుకు సంబంధించిన సమస్యలన్నీ తొలగిపోతాయని భావిస్తారు. లక్ష్మీదేవిని పూజించి గోధుమలు పెరుగన్నం నైవేద్యంగా సమర్పించాలని పురాణాలు చెబుతున్నాయి. కొందరు అక్షయ తృతీయ రోజున ఇంట్లో కొత్త తులసి మొక్కను నాటుతారు.



ఉగ్రదాడిని ప్రతిఒక్కరూ ఖండించాలి



అమరుల కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్న రిజిస్ట్రార్ యాదగిరి, టూటా ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేసి హతమార్చడాన్ని ప్రతి ఒక్క భారత పౌరుడు ఖండించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) ఆధ్వర్యంలో మంగళవారం పహల్గాం అమరుల కుటుంబాలకు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఉగ్రదాడికి ప్రతిగా కేంద్ర ప్రభుత్వం పాకిస్తాన్‌కు, ముస్లిం ఉగ్రవాదులకు ధీటైన జవాబు ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, టూటా అధ్యక్షుడు పున్నయ్య, కోశాధికారి నాగరాజు, వర్సిటీ ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ శివనారాయణసింగ్, అధ్యాపకులు శిరీష, వాసం చంద్రశేఖర్, పాత నాగరాజు, బాలకిషన్, మహేందర్ రెడ్డి, స్రవంతి, స్వప్న, నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాయాగౌడ్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

వీడీసీలను కట్టడి చేయండి



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ కులాల జేఏసీ నాయకులు

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ఆర్మూర్‌లో బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఆర్మూర్: గ్రామాల్లో రాజ్యాంగానికి వ్యతిరేకంగా సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లను కట్టడి చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వీడీసీలకు కుల వృత్తిదారులు వెట్టి చాకిరీ చేసే దయనీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్‌లో మంగళవారం బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో వీడీసీల ఆగడాలను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉన్న అన్ని కులాలపై వీడీసీలు పెత్తనం చెలాయిస్తూ కుల వృత్తులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తుల మీదనే కాకుండా జిల్లాలోని నాగంపేట్, మెండోర, పల్లికొండ, చేంగల్ తదితర గ్రామాల్లో యాదవులు, గంగపుత్రులు, రజక, ముదిరాజ్ తదితర కుల వృత్తులపై సైతం వీడీసీల ఆగడాలు కొనసాగుతున్నాయన్నారు. ఆయా కులవృత్తిదారుల నుంచి లక్షల రూపాయలు బలవంతంగా వసూలు చేస్తున్నారన్నారు. ఇకపై బీసీ కులాల జేఏసీ ఈ ఆగడాలను నియంత్రించడంలో పోరాటం చేస్తుందన్నారు. అనంతరం ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్, ఆర్మూర్ జేఏసీ అధ్యక్షులు నరసింహ చారి, వివిధ కుల సంఘాల ప్రతినిధులు బిజ్జు దత్తాద్రి, దేగం యాదగౌడ్, బస్సాపూర్ శంకర్, మహిపాల్ యాదవ్, బీఎస్ఎన్ఎల్ రాజన్న, రాజమల్లు యాదవ్, స్వామి యాదవ్, భుమన్న యాదవ్, గూపన్ పల్లి శంకర్, బట్టు నరేందర్, లక్ష్మి నర్సయ్య, రవినాథ్, పల్లికొండ నర్సయ్య, వేల్పూర్ శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్, రామగౌడ్, గంగాధర్, చందు, గంగాధర్, నర్సింగ్, రమేష్, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ కాంగ్రెస్‌లో ధిక్కార స్వరం

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో సీనియర్, జూనియర్ నేతల తగాదా కారణంగా ధిక్కార స్వరం వినిపిస్తోంది. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఇటీవల పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ల ఎంపికలో సీనియర్ కాంగ్రెస్ నాయకులను పక్కన పెట్టి ఇటీవల పార్టీలో చేరిన వారిని, పార్టీతో సంబంధం లేని వారిని డైరెక్టర్లుగా ప్రతిపాదించాడు. దీనిపై టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు కోల వెంకటేష్ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు మంగళవారం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. పదేళ్లుగా పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు ఇవ్వాలనే ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వినయ్‌రెడ్డి సొంత ఎజెండాను అమలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మీనాక్షి నటరాజన్ స్పందించి, ఫిర్యాదును పరిశీలిస్తామని పేర్కొన్నారని వెంకటేష్ వివరించాడు.

విద్యుదాఘాతంతో జీపీ కార్మికుడి మృతి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తించే ఎండీ బాబా(35) అనే కార్మికుడు మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డాడు. గ్రామంలోని విద్యుత్‌స్తంభాలకు బల్బులు అమర్చేక్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఒక కొడుకు ఉన్నారు. సమాచారం అందుకున్న నాగిరెడ్డిపేట పోలీసులు ఘటనపై వివరాలను సేకరిస్తున్నారు.

అల్ప్రాజోలం పట్టివేత

నవీపేట: మండలంలోని జన్నేపల్లి గ్రామంలోని కల్లుబట్టిపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించగా నిషేధిత మత్తుపదార్థం అల్ప్రాజోలం లభ్యమైనట్లు ఎస్సై వినయ్ తెలిపారు. మాక్లూర్ మండలంలోని చిక్లీ గ్రామానికి చెందిన భూమాగౌడ్ గత కొన్ని రోజులుగా జన్నేపల్లిలో కల్లుబట్టి నిర్వహిస్తుండగా, కల్లులో నిషేధిత మత్తుపదార్థం కలుపుతున్నాడని సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 21గ్రాముల అల్ప్రాజోలం లభ్యమైనట్లు పేర్కొన్నారు. అతడికి విక్రయించిన తుంగిని గ్రామానికి చెందిన రామాగౌడ్ ఇంటిపై దాడి చేయగా మరో 22 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరితోపాటు వీరికి విక్రయించిన నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

కేబుల్ వైర్లు చోరీ

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు సుమారు 50 వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు కత్తిరించి అపహరించుకుపోయినట్లు రైతులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

గంజాయి సేవించిన ఇద్దరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని కోజాకాలనీకి చెందిన షేక్ నోమాన్, ఖిల్లా రోడ్డుకు చెందిన మోహమ్మద్ అర్బాస్ మంగళవారం అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో ఒకటో టౌన్ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారికి గంజాయి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా గంజాయి తాగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు.

క్రైం కార్నర్

కువైట్‌లో ఎల్లారెడ్డిపల్లెవాసి మృతి



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామానికి చెందిన గోషికొండ గంగ నర్సయ్య(36) శుక్రవారం కువైట్‌లో అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడు నాలుగు సంవత్సరాలుగా కువైట్‌లో ఉంటున్నాడని, మృతుడికి భార్య, ఏడేళ్ల లోపు ఇద్దరు కొడుకులు ఉన్నట్లు తెలిపారు. మృతదేహం స్వగ్రామం చేరుకునేలా ప్రభుత్వం చొరవ చూపాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చోరీ సొత్తుతో పట్టుబడ్డ దొంగ

రాజంపేట: చోరీకి పాల్పడి సొత్తుతో బైక్‌పై వెళ్తున్న దుండగుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా.. రాజంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ప్రేమ్‌సింగ్, మహమ్మద్ అజీమ్‌లు సోమవారం రాత్రి గస్తీ నిర్వహిస్తుండగా తెల్లవారుజామున అనుమానాస్పదంగా బైక్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అతడు చోరీ చేసిన సొమ్ము, వస్తువులు కనిపించాయి. నిందితుడు భిక్కనూర్ మండలం, కామారెడ్డి పట్టణంలో దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి, కేసు నమోదు చేశారు. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. రాత్రివేళ నైట్ డ్యూటీ నిర్వహిస్తూ నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లను ఎస్సై పుష్పరాజ్ అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ గ్రామంలో సోమవారం రాత్రి డీసీఎంలో తరలిస్తున్న గడ్డికట్టలు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని సిర్‌పూర్ నుంచి ముదక్‌పల్లికి డీసీఎంలో గడ్డి కట్టలు తీసుకెళ్తున్నారు. సిర్‌పూర్ గ్రామ పంచాయతీ వద్ద విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి మంటలు చెలరేగాయి. స్థానికులు బోరు పైపుతో నీరు పట్టి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ గడ్డి కట్టలకు మంటలు అంటుకుని చెలరేగడంతో గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదంలో డీసీఎం వ్యాన్ స్వల్పంగా దెబ్బతినగా, గడ్డి కట్టలు కాలిపోయాయి.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో మూడురోజుల జైలుశిక్ష

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని నాగ్‌పూర్ గేట్, సీఎంసీ చౌరస్తాలో ఈ నెల 20న ఎస్సై ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. బీబీపూర్ తండాకు చెందిన బదావత్ మంగులాల్, మహారాష్ట్రకు చెందిన శ్రీరంగు రామ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రహీముద్దిన్ నిందితులకు మూడు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో నిందితులను జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దోమకొండలో వ్యక్తి అదృశ్యం



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అవధూత నర్సింలు (49) అదృశ్యమైనట్లు ఎస్సై స్రవంతి మంగళవారం తెలిపారు. ఈనెల 25న ఉదయం నర్సింలు ఇంట్లో మేస్త్రీ పనికి వెళ్లి వస్తా అని చెప్పి బయటకు వెళ్లాడు. ఇప్పటివరకు తిరిగి ఇంటికి రాలేదు. నాలుగు రోజులుగా కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం నర్సింలు కుమారుడు సిద్ధిశ్వర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

కమ్మర్‌పల్లిలో ఒకరి ఆత్మహత్య

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన వేముల పోశెట్టి(55) ఈనెల 27న ఇంటి నుంచి బయటకి వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికగా లభించలేదు. దీంతో సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని చెరువులో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, వేముల పోశెట్టిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోశెట్టి కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దీంతో మనస్తాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో తేలింది. మృతుడి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న డ్రైవర్ గంగాధర్ ఆత్మహత్యకు యత్నించాడు. ఈనెల 22 నుంచి మెడికల్ సెలవులో ఉన్న గంగాధర్ మంగళవారం డిపోకు వచ్చాడు. డిపోలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డు వద్దకు వచ్చి తాను గడ్డి మందు సేవించానని చెప్పడంతో అక్కడున్న సిబ్బంది వెంటనే గంగాధర్‌ను బాన్సువాడ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గంగాధర్ పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం సరితాదేవిని వివరణ కోరగా.. గంగాధర్ తనను కలిసేందుకు డిపోకు వచ్చాడని, కార్యాలయంలో సిక్ లీవ్ కోసం దరఖాస్తు రాసివ్వమని చెప్పి తాను బిచ్కుందకు వెళ్లినట్లు తెలిపారు. గతంలో కూడా గంగాధర్ రెండు, మూడు సార్లు ఇలాగే చేశాడని ఆమె అన్నారు.

హంగర్గాలో చోరీ



హంగర్గాలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా గ్రామంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన పుట్టి రాములుకు ఇద్దరు కుమారులు లక్ష్మణ్, శ్రీకాంత్ ఉన్నారు. వేసవి ఉక్కపోత కారణంగా శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి డాబాపై నిద్రించారు. రాత్రి వేళ దుండగులు ఇంట్లోకి చొరబడి లక్ష్మణ్ గదికి బయట నుంచి గొళ్లెం వేసి ఇంట్లో ఉన్న వస్తువులు ఎత్తుకెళ్లారు. శ్రీకాంత్ గదిలో ఉన్న బీరువా తాళం పగులగొట్టి ఐదు తులాల బంగారు, నాలుగు తులాల వెండి ఆభరణాలు, ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

హైవేపై దారిదోపిడీ

బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి శివారులోని జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డుపై దారిదోపిడీ జరిగింది. ముప్కాల్ ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాలు ఇలా.. మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన ఏలేటి దేవాయి తన బంధువులతో కలిసి ఆటోలో సోమవారం ముప్కాల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. అదేరోజు రాత్రి 9.30 గంటల ప్రాంతంలో కోడిచర్లకు తిరుగుపయనమయ్యారు. కొత్తపల్లి శివారులోని హైవే సర్వీస్ రోడ్డు నుంచి బైపాస్ రోడ్డు ఎక్కుతున్న సమయంలో స్పీడ్ బ్రేకర్ ఉండటంతో ఆటో వేగం తగ్గించారు. ఇది గమనించిన ముగ్గురు దుండగులు ఒక్కసారిగా ఆటోలో ప్రయాణిస్తున్న గుండుక మంజుల మెడలో గొలుసు పట్టుకుని లాగగా చిక్కలేదు. వెనుక వరుసలో కుర్చున్న ఏలేటి దేవాయి మెడలో బంగారు గుండ్లను పట్టి లాగడంతో కొంత భాగం (పదిగ్రాములు) తెగి దుండగుల చేతికి చిక్కింది. దీంతో దుండగులు బైక్‌పై వెంటనే పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు క్యాష్‌ప్రైజ్



సిబ్బందిని అభినందిస్తున్న ఉన్నతాధికారులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు రాష్ట్ర ఎక్సైజ్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి మంగళవారం రూ. 15వేల క్యాష్ రివార్డు అందజేశారు. ఇటీవల నవీపేట్ మండలం యంచ వద్ద 30కిలోల డ్రై గంజాయి, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది స్వాధీనం చేసుకుని, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈసందర్భంగా వారిని అభినందిస్తూ క్యాష్‌ప్రైజ్‌ను అందజేశారు. అలాగే ఫిబ్రవరి 14న కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్‌లో 91కిలోల ఎండుగంజాయిని పట్టుకున్నారు. వీరికి రూ.30 వేల క్యాష్ ప్రైజ్ ఇచ్చారు. ఎక్సైజ్ అదనపు కమిషనర్ ముఖర్జీ, డీసీ సోమిరెడ్డి, ఎస్టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రణవని, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ స్వప్న, ఎస్సై రామకుమార్, సిబ్బంది హమీద్, అవినాష్, విష్ణు, సుకన్య, శ్యామ్ సుందర్, సాయి కుమార్‌లు ఉన్నారు.

గోశాలకు ఆవుల తరలింపు



రామారెడ్డి: కరీంనగర్ జిల్లా నుంచి మూడు చిన్న టాటా ఏస్ వాహనాల్లో 16కు పైగా ఆవులను మంగళవారం మండుటెండలో తూప్రాన్ తరలిస్తుండగా మాచారెడ్డి పోలీసులు పట్టుకొని మద్దికుంటలోని గోశాలకు తరలించారు. ఈ ఆవులను తూప్రాన్ సంతలో రైతులకు అమ్మడానికి తీసుకెళ్తున్నట్టుగా సమాచారం. కానీ ఆవులకు కనీస వసతులు కల్పించకుండా ఒక్కో వాహనంలో ఆరు ఆవులను ఎండలో తరలిస్తుండడంతో అవి విలవిలకొట్టుకోవడాన్ని పోలీసులు గమనించి అడ్డుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి, ఆవులను మద్దికుంట గోశాలకు తరలించారు.

దొంగల ముఠా సభ్యుల అరెస్టు

ఇందల్వాయి: వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై సందీప్, డిచ్‌పల్లి సీఐ మల్లేష్ వివరాలు వెల్లడించారు. గన్నారం ఎక్స్ రోడ్ దగ్గర పోలీసులు మంగళవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని పట్టుకొని, విచారించారు. వారం రోజుల కిందట ఇందల్వాయి మండలంలో జరిగిన వరుస దొంగతనాలు, జక్రాన్‌పల్లి మండలం పడకల్‌లో జరిగిన దొంగతనాలకు, భిక్కనూరులోని బస్వాపూర్‌లో జరిగిన దొంగతనాలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో చందుర్తి, కోనారావుపేటల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాలోని సభ్యులుగా గుర్తించారు. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో సుమారు పది కేసులలో నిందితులుగా ఉన్నారన్నారు. వారి వద్ద నుంచి రెండు కార్లు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్ఆర్ చౌరస్తా, న్యాల్‌కల్ ప్రాంతాలలో రోడ్డు వరకు ఉన్న షెడ్లు, ఆక్రమణలను మంగళవారం ట్రాఫిక్ ఏసీపీ నారాయణ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆక్రమణలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణదారులు నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.